క్లుప్తంగా

సన్మానం



వృద్ధ ఓటర్లతో అధికారులు

హుస్నాబాద్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఐఓసీ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఆర్డీఓ బెన్ షాలోమ్ సన్మానించారు. నియోజకవర్గంలో 80 సంవత్సరాలు నిండిన 150 మంది సీనియర్ ఓటర్లను సన్మానించారు. వయో వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చేప పిల్లలు చెరువులోకి..



పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న నాయకులు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్ పెద్ద చెరువులో ఆదివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను వితరణ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రమేశ్ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు చొరవతో చేప పిల్లలను సొసైటీ ద్వారా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, ఉపసర్పంచ్ కనకరాజు, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో జర్నలిస్టులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 21వ రోజు దీక్షలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల జర్నలిస్టులు కూర్చున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీక్షకు జేఏసీ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

'మోకు దెబ్బ' మహాసభకు తరలిరండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 3న నిర్మల్‌లో నిర్వహించబోయే గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) మూడో మహా సభను విజయవంతం చేయాలని జిల్లా మోకు దెబ్బ అధ్యక్షుడు స్వామి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆదివారం మహాసభ వాల్‌పోస్టర్‌ను కొమురవెల్లి గౌడ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులు, మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణ, జిల్లా కార్యదర్శులు కొయ్యడ శ్రీనివాస్, ముత్యం విజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎస్ఎస్ కన్వెన్షన్ ప్రారంభం



మాట్లాడుతున్న ట్రస్టు ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని రంగనాయకుల గుట్ట ఆవరణలో నిర్మించిన వైశ్య సంక్షేమ సమితి కన్వెన్షన్‌ను సోమవారం ఉదయం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారని వీఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం కన్వెన్షన్ ఆవరణలో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సహకారంతో రూ. 6.50 కోట్లతో రాష్ట్రంలోనే మోడల్‌గా ఈ భవనం నిర్మించామన్నారు. నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య, వైద్యంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల కోసం వినియోగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అంజయ్య, రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం.. స్వచ్ఛతకు సోపానం

పల్లెలు, పట్టణాలు కదిలాయి.. స్వచ్ఛతకు శ్రీకారం చుట్టాయి. జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు ఆదివారం గంట పాటు శ్రమదానం చేపట్టారు. పేరుకుపోయిన చెత్తను తొలగించారు. తమ తమ వార్డుల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, మురికి కాలువలు శుభ్రం చేశారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.



దుబ్బాక: రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత తదితరులు



హుస్నాబాద్: రోడ్డును ఊడుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు



చిన్నకోడూరు(సిద్దిపేట): సికింద్లాపూర్‌లో..



చేర్యాల: రోడ్డును ఊడుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి



కొమురవెల్లిలో..



సిద్దిపేట రూరల్: గుర్రాలగొందిలో..



వర్గల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు



సిద్దిపేట: రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అన్ని రంగాల్లో రాష్ట్రం అగ్రగామి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారని చెప్పారు. సీఎం చొరవతో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో ఆదర్శంగా మారిందన్నారు. ఇక్కడ చేపట్టిన భారీ అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్రానికే నమూనాగా నిలిచాయన్నారు. నియోజకవర్గంలోని ములుగు, వర్గల్, గజ్వేల్, కొండపాక మండలాల్లో రూ. 500 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి మంత్రి హరీశ్‌రావు ఈనెల 3వ తేదీన వస్తున్నారని తెలిపారు. సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వీరాపూర్, వడ్లూరు, గుండారం గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రగతి నివేదన సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వసతుల కల్పనతో పాటు ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రూ. కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ తీసుకొస్తుందని మండిపడ్డారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులను కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించగా కార్యక్రమానికి హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు.

వైద్యరంగానికి పెద్దపీట

గజ్వేల్‌రూరల్: మెరుగైన వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆదివారం గజ్వేల్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌తో ప్రైవేటు పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జంకిని కరీంనగర్ జిల్లాలోకి మార్చాలి



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని పూర్వం ఉన్న విధంగా కరీంనగర్ జిల్లాలోకి మార్చాలని కరీంనగర్ జిల్లా పోరాట సమితి సమన్వయకర్తలు శ్రీనివాస్, మల్లికార్జున్, రవి తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. సోమవారం బెజ్జంకిలోని మహాత్మ గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

భూమి పూజ



విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, ఎంపీటీసీ భూములుగౌడ్, పీఏ న్‌ఆర్ ట్రస్టు నిర్వాహకుడు నరేందర్, ఎన్ఆర్ ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు రాలు కోల సద్గుణ, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్‌చారి, గ్రామాధ్యక్షులు నర్సింహాచారి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు 'ఆపన్నహస్తం'



ఆర్థికసాయం అందజేస్తున్న ఆపన్నహస్త మిత్ర బృందం

గజ్వేల్‌రూరల్: అనాథ చిన్నారులకు గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు చేయూతనందించారు. మెదక్ జిల్లా మాసాయిపేటలోని నిరుపేద కుటుంబానికి చెందిన కాశమైన మహేష్, అతడి భార్య హేమలత మృతితో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. ప్రస్తుతం నానమ్మ, తాత సమక్షంలో ఉంటున్న చిన్నారుల దయనీయ పరిస్థితిని తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు తమ 81వ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గజ్వేల్ పట్టణంలో రూ. 15 వేల నగదుతో పాటు మరో రూ. 5 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే గ్రూపు సభ్యులు శ్రీధర్, అతడి మిత్రులు తక్షణమే స్పందించి మరో రూ. 15 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి శ్యాంప్రసాద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి



బైక్‌ర్యాలీలో శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

రాయపోలు(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశమివ్వాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రవణ్‌కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాయపోలు మండలంలో ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదన్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. మెదక్ ఎంపీగా రెండుసార్లు గెలిచిన ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. అలాగే ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో ఒరిగిందేమీలేదని విమర్శించారు.

మా సమస్యలు పరిష్కరించండి



దుబ్బాకలో ఆశావర్కర్ల మానవహారం



సిద్దిపేటలో చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న ఆశాకార్యకర్తలు

దుబ్బాక/హుస్నాబాద్/తొగుట(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దుబ్బాకలో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హుస్నాబాద్ పట్టణంలో ఆశావర్కర్ల సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వకుండా పారితోషికం పేరుతో తక్కువ వేతనం ఇస్తున్నారని మండిపడ్డారు. తొగుట మండల కేంద్రంలో కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశాలు ఆదివారం కళ్లు మూసుకుని నిరసన వ్యక్తంచేశారు.

సిద్దిపేటలో ఆశాలు చెవిలో పూలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లారపు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం అందించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు.



హుస్నాబాద్: మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్

బాలల కథలు బహుబాగు



జోర్దార్ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాల సాహిత్యంలో వచ్చే కథలు బాలలకు బహుబాగుగా నచ్చుతాయని కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రముఖ బాలసాహితీ వేత్త పైడిమర్రి రామకృష్ణ రచించిన జోర్దార్ కథలు పుస్తక సంపుటి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. బాలల కోసం ఎంత చేసిన తక్కువేనని, బాలసాహిత్య పుస్తకాలు బాలలకు చేరాలన్నారు. తెలంగాణ మాండలికంలో వచ్చిన కథలు, తెలంగాణ ప్రాంతంలోని బాలల వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. బాలల కోసం వివిధ ప్రక్రియలో పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, బస్వ రాజ్‌కుమార్, కోణం పర్శరాములు, శ్రీచరణ్ సాయిదాస్ పాల్గొన్నారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే..

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెల్లారపు తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కమిటీ సభ్యురాలు కళావతి, అరుణ, అంజమ్మ, రాజవ్వ, సరళ, కమల, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సిద్దిపేటలో పోలీస్ బందోబస్తు**

సిద్దిపేటకమాన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సిద్దిపేట పట్టణంలో ఆదివారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

◆ **నేడు కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష**

తొగుట(దుబ్బాక): తొగుటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సత్యాగ్రహ దీక్షను నిర్వహించనున్నట్టు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అక్కం స్వామి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే సత్యాగ్రహ దీక్షలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

◆ **పట్టణంలోనే శ్మశానవాటిక నిర్మించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోనే ముస్లింలకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కోరారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రైతుల నుంచి కెనాల్ కోసం సేకరించిన భూమిని ముస్లింల శ్మశానవాటిక కోసం కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **నూతన పాలకమండలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పురాతన ఆలయం వీర హనుమాన్ దేవాలయ నూతన పాలక మండలిని ఆదివారం మంత్రి హరీశ్‌రావు నియమించారు. ఆలయ చైర్మన్‌గా అయిత రత్నాకర్, పాలకమండలి సభ్యులుగా పారుపల్లి ఈశ్వర్ చరణ్, గ్యాదరి స్వర్ణలత, బాల మల్లేశం, కటకం మోహనయ్యను నియమించారు.

◆ **వాసవిక్లబ్ సేవలు అభినందనీయం**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవిక్లబ్ సేవలు అభినందనీయమని వాసవియాన్స్ కపుల్ సిల్వర్ స్టార్ విశ్వనాథం నగేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పుల్లూరి ప్రాంతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం 105 రీజియన్ చైర్మన్ పుల్లూరి శివకుమార్ తన రీజియన్‌లో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను ఆయా క్లబ్‌ల సభ్యులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

దుబ్బాకరూరల్: దుబ్బాకలోని ప్రభుత్వ ఐటీఐలో ఐదో విడతలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **పరిశుభ్రతే ఆరోగ్య రక్ష**

హుస్నాబాద్: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం మండల వనరుల కేంద్రం ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చెత్త రహిత దేశం కావాలనే లక్ష్యంతో నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పరిశుభ్రతే మానవాళి మనుగడకు ఆరోగ్యరక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, కౌన్సిలర్ వేణుయాదవ్, నాయకులు తోట స్వరూప, సతీష్, రవి, సమ్మయ్య, మహేష్కర్, భీమేశ్వర్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

◆ **గణేష్ లడ్డూ @రూ. 90 వేలు**



చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో సచిన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. రూ. 90 వేలకు కాటం వెంకటేష్ లడ్డూను దక్కించుకోగా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల నరేష్‌గౌడ్ అందజేశారు.